रजिस्ट्री सं. डी—२२१
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య డి—221

मूल्य रु ५.०० पैसे
[Price Rs. 5.00 Paise.
మూల్యము : రూ. 5.00 పైసలు

# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण
EXTRAORDINARY
అసాధారణ

भाग XVI अनुभाग 1
Part XVI Section 1
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
PUBLISHED BY AUTHORITY
ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

| | | | | |
|---|---|---|---|---|
| सं १ | नई दिल्ली | बुधवार | ७ मार्च, २०१२/१७ पाल्गुण | संण्ड २०. |
| No. 1 | New Delhi | Wednesday | 7 March, 2012/17 Phalguna | Vol. 20 |
| సంఖ్య 1 | న్యూఢిల్లీ | బుధవారము | 7 మార్చి, 2012/17 ఫాల్గుణ | సంపుటము 20 |

## MINISTRY OF LAW AND JUSTICE
## (LEGISLATIVE DEPARTMENT)

New Delhi, 13th January, 2012/Paush, 1933 Khara.

The Translation in Telugu of the following Act namely:-

The Mahatma Gandhi National Rural Employment Guarantee Act, 2005 (Act No. 42 of 2005) are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Text thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Text (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

J-90-1

శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ

(శాసన నిర్మాణ విభాగము)

ఈ క్రింది చట్టము, అనగా,

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉద్యోగ హామీ చట్టము, 2005 (2005లోని 42వ చట్టము) యొక్క తెలుగు అనువాదమును రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఆ చట్టమునకు గల ఈ అనువాదమును ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము 1973 (1973లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఏ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉద్యోగ హామీ చట్టము, 2005

(2005లోని 42వ చట్టము)

[2005 సెప్టెంబరు, 5]

దేశములోని గ్రామీణ ప్రాంతములలో నైపుణ్యా రహిత శారీరక శ్రమ చేయుటకు స్వచ్ఛందముగా ముందుకు వచ్చే వయోజనులు గల ప్రతి కుటుంబానికి, ప్రతి ఆర్థిక సంవత్సరములో ఖచ్చితముగా కనీసం వందదినములు వేతన సహిత ఉద్యోగమును కల్పించి తద్వారా ఆయా కుటుంబాలకు జీవనోపాధి భద్రతను పెంపొందించేందుకు, మరియు అందుకు సంబంధించిన లేక అనుషంగిక విషయములను నిబంధించుటకైన చట్టము.

భారత గణ రాజ్యము యాబది ఆరవ సంవత్సరములో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయబడినది:-

## అధ్యాయము - 1
## ప్రారంభిక

సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము.

1.(1) ఈ చట్టమును మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉద్యోగ హామీ చట్టము, 2005 అని పేర్కొనవచ్చును.

(2) ఇది, యావద్భారత దేశమునకు విస్తరించును.

(3) ఇది కేంద్ర ప్రభుత్వము అధికారిక గెజెటులో అధిసూచన ద్వారా నియతము చేయునట్టి తేదీ అనగా 02-02-2006 న అమలులోనికి వచ్చును; మరియు వివిధ రాజ్యముల కొరకు లేక రాజ్యములోని వివిధ ప్రాంతముల కొరకు వేరు వేరు తేదీలను నియతము చేయ వచ్చును. మరియు ఈ చట్ట ప్రారంభము గురించి అట్టి నిబంధనలోని ఏదేని నిర్దేశమును, ఆ నిబంధన అట్టి రాజ్యములో లేక సందర్భానుసారముగ, అట్టి ప్రాంతములోని నిబంధన అమలులోనికి వచ్చినట్లు చేసిన నిర్దేశముగా అన్వయించ వలెను:

అయితే, ఈచట్టము ప్రారంభమైన తేదీ నుండి ఐదు సంవత్సరముల కాలావధి లోపల అది విస్తరించునట్టి రాజ్య క్షేత్రమంతటికిని వర్తించవలెను.

నిర్వచనములు.

2. ఈ చట్టములో సందర్భము ఇతర విధముగా ఉన్ననే తప్ప,--

(ఎ) "వయోజనుడు" అనగా పదునెనిమిది సంవత్సరముల వయస్సు నిండిన వ్యక్తి అని అర్థము;

(బి) "దరఖాస్తుదారు" అనగా ఈ పథకము క్రింద ఉద్యోగము కొరకు దరఖాస్తు చేసుకొనిన కుటుంబ యజమాని లేక ఆ కుటుంబములోని వయోజన సభ్యులలోని ఎవరేని ఇతర సభ్యుడు అని అర్థము;

(సి) "బ్లాకు" అనగా జిల్లాలోని గ్రామ పంచాయితీల సముదాయముతో కూడిన సమాజాభివృద్ధి ప్రాంతము అని అర్థము;

(డి) "కేంద్ర పరిషత్తు" అనగా 10వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఏర్పాటు చేయబడిన కేంద్ర ఉద్యోగ హామీ పరిషత్తు అని అర్థము;

(ఇ) "జిల్లా కార్యక్రమ సమన్వయకర్త" అనగా జిల్లాలో పథకము అమలు కొరకు 14వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద జిల్లా కార్యక్రమ సమన్వయకర్తగా నియోగించ బడిన రాజ్య ప్రభుత్వాధికారి అని అర్థము;

(ఎఫ్) "కుటుంబము" అనగా రక్తసంబంధం ద్వారా గాని వివాహము లేక దత్తత ద్వారా గాని ఒకరికొరకు సంబంధం కలిగియుండి మరియు సాధారణముగా కలిసి నివసిస్తూ మరియు కలిసి భోజనం చేస్తూ లేక ఉమ్మడి రేషను కార్డు కలిగివున్నట్టి కుటుంబ సభ్యులు అని అర్థము;

(జి) "అమలుచేయు ఏజెన్సీ" అను పద పరిధిలో, ఒక పథకము క్రింద చేపట్టిన ఏదేని పనిని అమలుచేయు కేంద్రప్రభుత్వపు లేక రాజ్య ప్రభుత్వపు ఏదేని విభాగము, జిల్లా పరిషత్తు, మధ్యస్థ స్థాయిలో పంచాయితీ, గ్రామపంచాయితీ లేక ఏదేని స్థానిక ప్రాధికారము లేక కేంద్ర ప్రభుత్వము లేక రాజ్య ప్రభుత్వముచే ప్రాధికారమీయబడిన ప్రభుత్వరంగ వ్యవస్థ లేక ప్రభుత్వేతర వ్యవస్థ చేరియుండును;

(హెచ్) ఏదేని ప్రాంతమునకు సంబంధించి "కనీస వేతనం" అనగా కనీస వేతనముల చట్టము, 1948 యొక్క 3వ పరిచ్ఛేదము క్రింద ఆ ప్రాంతములో వర్తించు విధముగా, రాజ్య ప్రభుత్వముచే నిర్ణయించబడిన కనీస వేతనము అని అర్థము;

1948 లోని 11వ చట్టము.

(ఐ) "జాతీయ నిధి" అనగా 20వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1)క్రింద స్థాపించబడిన జాతీయ ఉద్యోగ హామీ నిధి అని అర్థము;

(జె) "అధిసూచన" అనగా అధికారిక గెజెటులో ప్రచురించిన అధిసూచన అని అర్థము;

(కె) "ప్రాధాన్యతా పని" అనగా పథకము క్రింద ప్రాధాన్యతనుబట్టి అమలు చేయుట కొరకు చేపట్టిన ఏదేని పని అని అర్థము;

(ఎల్) "విహితపరచిన" అనగా ఈ చట్టము క్రింద నియమముల ద్వారా విహిత-పరచిన అని అర్థము;

(ఎమ్) "కార్యక్రమ అధికారి" అనగా పథకము అమలుచేయుటకు 15వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము(1) క్రింద నియమించబడిన అధికారి అని అర్థము;

(ఎన్) "ప్రాజెక్టు" అనగా దరఖాస్తుదారులకు ఉద్యోగము కల్పించు పథకం క్రింద చేపట్టిన ఏదైనా పని అని అర్థము;

(ఓ) "గ్రామీణ ప్రాంతము" అనగా తత్సమయమున అమలునందున్న ఏదేని శాసనము క్రింద స్థాపించబడిన లేక సంఘటితము చేయబడిన ఏదేని పట్టణ ప్రాంత స్థానిక నికాయము లేక కంటోన్మెంట్ బోర్డు పరిధి క్రిందకి వచ్చు ప్రాంతము మినహా రాజ్యములోని ఏదేని ప్రాంతము అని అర్థము;

(పి) "పథకము" అనగా 4వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద రాజ్య ప్రభుత్వముచే అధిసూచించబడిన పథకము అని అర్థము;

(క్యూ) "రాజ్యపరిషత్తు" అనగా 12వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద సంఘటితము చేయబడిన రాజ్య ఉద్యోగ హామీ పరిషత్తు అని అర్థము;

(ఆర్) "నైపుణ్యరహిత శారీరక శ్రమ" అనగా ఎవరేని వయోజన వ్యక్తి ఏవిధమైన నైపుణ్యముగాని ప్రత్యేక శిక్షణగాని లేకుండా చేయగలిగిన ఏదేని శారీరక పని అని అర్థము;

(యస్) "వేతన రేటు" అనగా 6వ పరిచ్ఛేదములో పేర్కొనిన వేతన రేటు అని అర్థము.

## అధ్యాయము - 2
## గ్రామీణ ప్రాంతములలో ఉద్యోగ హామీ

గ్రామీణ కుటుంబాలకు ఉద్యోగ హామీ.

3.(1) ఇతర విధంగా నిబంధించబడిననే తప్ప, రాజ్య ప్రభుత్వము, రాజ్యములో కేంద్ర ప్రభుత్వముచే అధిసూచించబడునట్టి గ్రామీణ ప్రాంతాలలో నైపుణ్యరహిత శారీరక శ్రమచేయుటకు స్వచ్ఛందముగా ముందుకు వచ్చే వయోజనులు గల ప్రతి కుటుంబమునకు, ఈచట్టము క్రింద రూపొందించబడిన పథకమునుసరించి, ఒక ఆర్థిక సంవత్సరములో కనీసం వంద దినములకు తక్కువకాని పనిని కల్పించవలెను.

(2) పథకము క్రింద ఇచ్చిన పనిని చేసిన ప్రతివ్యక్తి, ప్రతి దినమునకు నిర్ణయించబడిన వేతన రేటుననుసరించి వేతనము పొందుటకు హక్కు కలిగి ఉండును.

J-90-2

(3) ఈ చట్టములో ఇతర విధముగా నిబంధించబడిననే తప్ప, రోజువారీ వేతనములను వారంవారీగా లేక ఆ పనిచేసిన తేదీ తరువాత ఎట్టి సందర్భములోను పక్షం రోజులు దాటకుండా బట్వాడా చేయవలెను.

(4) కేంద్రప్రభుత్వము లేక రాజ్య ప్రభుత్వము తమ తమ ఆర్థిక సామర్థ్యం మరియు అభివృద్ధి పరిమితులకు లోబడి, ఉపపరిచ్ఛేదము (1) క్రింద హామీ ఈయబడిన కాలావధికి మించిన ఏదేని కాలావధికి కుటుంబపు ప్రతి వయోజన సభ్యునికి ఏదైనా పథకం క్రింద పనిని కల్పించుటకు ఏర్పాట్లు చేయవచ్చును.

## అధ్యాయము - 3

## ఉద్యోగ హామీ పథకములు మరియు నిరుద్యోగ భృతి

గ్రామీణ ప్రాంతముల కొరకు ఉద్యోగ హామీ పథకములు.

4.(1) 3వ పరిచ్ఛేదపు నిబంధనలు అమలు చేయుటకుగాను, ప్రతి రాజ్య ప్రభుత్వము ఈ చట్ట ప్రారంభ తేదీ నుండి ఆరు మాసముల లోపల అధిసూచన ద్వారా పథకము పరిధి క్రిందికి వచ్చు గ్రామీణ ప్రాంతాలలో నైపుణ్యరహిత శారీరక శ్రమ చేయడానికి ఈ చట్టము ద్వారా లేక ఈ చట్టము క్రింద మరియు పథకములో పొందుపరచిన షరతులకు లోబడి స్వచ్ఛందముగా ముందుకువచ్చు వయోజనులు కల ప్రతి కుటుంబమునకు ఒక ఆర్థిక సంవత్సరములో కనీసం వంద దినములకు తక్కువకాని ఉద్యోగమును కచ్చితముగా కల్పించుటకు పథకము రూపొందించ వలెను:

అయితే, రాజ్య ప్రభుత్వముచే అట్టి ఏదేని పథకము అధిసూచించబడునంత వరకు, అట్టి అధిసూచనకు ముందు సంబంధిత ప్రాంతములో అమలులో ఉన్న ఏదైనా వార్షిక కార్యాచరణ ప్రణాళిక లేక సంపుర్ణ గ్రామీణ రోజ్ గార్ యోజన (యస్.జి.ఆర్.వై) లేక జాతీయ పనికి ఆహార కార్యక్రమమును (ఎన్.ఎఫ్.ఎఫ్.డబ్ల్యు.పి) ఈచట్ట ప్రయోజనముల నిమిత్తము పథకము కొరకైన కార్యాచరణ ప్రణాళికగా భావించవలెను.

(2) రాజ్య ప్రభుత్వము, తమచే రూపొందించబడిన పథకము యొక్క సారాంశమును కనీసం రెండు స్థానిక వార్తాపత్రికలలో ప్రచురించవలెను. అందులో ఒకటి అట్టి పథకము వర్తించు ప్రాంతము లేక ప్రాంతములలో చలామణిలో ఉన్న అందరికి తెలిసే స్థానిక భాషలో ప్రచురించబడునదై ఉండవలెను.

(3) ఉప-పరిచ్ఛేదము(1) క్రింద రూపొందించిన పథకములో అనుసూచి-1లో నిర్దిష్టపరచిన కనీస లక్షణములను సమకూర్చవలెను.

హామీ ఈయబడిన ఉద్యోగమును కల్పించుటకు షరతులు.

5.(1) రాజ్య ప్రభుత్వము, అనుసూచి-2లో నిర్దిష్టపరచిన షరతులకు భంగము కలుగకుండ ఈ చట్టము క్రింద హామీ ఈయబడిన ఉద్యోగమును కల్పించుట కొరకైన షరతులను పథకములో నిర్దిష్టపరచవచ్చును.

(2) ఈ చట్టము క్రింద రూపొందించిన ఏదేని పథకము క్రింద నియమించబడిన వ్యక్తులు, అనుసూచి-2లో నిర్దిష్టపరచిన కనీస సౌకర్యముల కంటే తక్కువ కానట్టి సౌకర్యములు పొందుటకు హక్కు కలిగివుందురు.

వేతన రేటు 1948లోని 11వ చట్టము.

6.(1) కనీస వేతనముల చట్టము, 1948లో ఏమి ఉన్నప్పటికిని, కేంద్ర ప్రభుత్వము, అధిసూచన ద్వారా ఈ చట్టము యొక్క ప్రయోజనముల నిమిత్తము వేతన రేటును నిర్దిష్టపరచవచ్చును:

అయితే, వేరు వేరు ప్రాంతముల కొరకు వేరువేరు వేతన రేట్లను నిర్దిష్టపరచవచ్చును:

అంతేకాక, ఆయా సమయములందు అట్టి ఏదేని అధిసూచన క్రింద నిర్దిష్టపరచిన వేతన రేటు దినము ఒక్కింటికి అరువది రూపాయల కంటే తక్కువ ఉండరాదు.

1948లోని 11వ చట్టము.

(2) రాజ్యములోని ఏదేని ప్రాంతమునకు సంబంధించి కేంద్ర ప్రభుత్వముచే వేతన రేటు నిర్ణయించబడునంతవరకు, కనీస వేతనముల చట్టము, 1948లోని 3వ పరిచ్ఛేదము క్రింద రాజ్య ప్రభుత్వముచే వ్యవసాయ కార్మికుల కొరకు నిర్ణయించబడిన కనీసవేతనమును ఆ ప్రాంతమునకు వర్తించు వేతన రేటుగా పరిగణించవలెను.

నిరుద్యోగ భృతి చెల్లింపు.

7.(1) పథకము క్రింద ఉద్యోగమును కోరుచూ దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు-దారుడికి అతడి దరఖాస్తును స్వీకరించిన తేదీ లేక ముందస్తు దరఖాస్తు చేసుకున్న సందర్భములో ఉద్యోగమును కోరిన తేదీ, ఇందులో ఏది తరువాత తేదీ అగునో అప్పటి నుండి పదిహేను దినముల లోపల ఉద్యోగము కల్పించబడనిచో అతడు ఈ పరిచ్ఛేదము ననుసరించి దినసరి నిరుద్యోగభృతిని పొందుటకు హక్కు కలిగివుండును.

(2) అర్హతకు సంబంధించి రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి నిబంధనలు మరియు షరతులకు లోబడి, ఈ చట్ట నిబంధనలు మరియు పథకములు మరియు రాజ్య ప్రభుత్వ ఆర్థిక శక్తి సామర్థ్యములకు లోబడి, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద చెల్లించవలసిన నిరుద్యోగ భృతిని కుటుంబ హక్కుకు లోబడి, కుటుంబము యొక్క దరఖాస్తుదారులకు రాజ్య పరిషత్తుతో సంప్రదించి రాజ్య ప్రభుత్వముచే అధిసూచన ద్వారా నిర్దిష్టపరచబడునట్టి రేటు చొప్పున చెల్లించ వలెను:

అయితే, అట్టి రేటు ఏదియు ఆర్థిక సంవత్సరములోని మొదటి ముప్పది దినములకు వేతన రేటులో నాల్గవ వంతు కంటే తక్కువగాను మరియు ఆర్థిక సంవత్సరములోని మిగతా కాలావధికి వేతనరేటులో సగంకంటె తక్కువగాను ఉండరాదు.

(3) (ఎ) దరఖాస్తుదారుడికి పనిచేయుటకై స్వయముగా పనిలో చేరమని గాని లేక అతడి కుటుంబము నుండి కనీసం ఒక వయోజన సభ్యుడిని ప్రతినిధిగా పంపుమనిగాని గ్రామపంచాయతీ లేక కార్యక్రమ అధికారి ఆదేశించిన వెనువెంటనే; లేక

(బి) ఉద్యోగము కోరిన కాలావధి ముగిసిన తరువాత మరియు ఉద్యోగము కొరకు దరఖాస్తుదారుడి కుటుంబ సభ్యుడు ఎవరును రానియెడల; లేక

(సి) దరఖాస్తుదారుడి కుటుంబములోని వయోజన సభ్యులకు ఆర్థిక సంవత్సరములో మొత్తం మీద కనీసం వంద దినముల పని కల్పించబడినయెడల; లేక

(డి) దరఖాస్తుదారుడి కుటుంబము, వేతనములు మరియు నిరుద్యోగ భృతి రెండు కలిపి ఆర్థిక సంవత్సరములో వంద దినముల పని కొరకైన వేతనములకు సమానమైన మొత్తమును ఆర్జించినయెడల;

ఆ ఆర్థిక సంవత్సరములో కుటుంబమునకు నిరుద్యోగ భృతిని చెల్లించవలసిన రాజ్య ప్రభుత్వ బాధ్యత సమాప్తమవుతుంది.

(4) దరఖాస్తుదారుడి కుటుంబమునకు ఉమ్మడిగా చెల్లించవలసిన నిరుద్యోగ భృతిని రాజ్య ప్రభుత్వము, అధిసూచన ద్వారా ఈ విషయమై ప్రాధికారమిచ్చునట్లుగా, కార్యక్రమ అధికారి లేక అట్టి స్థానిక ప్రాధికారిచే; (జిల్లా, మధ్యస్థ లేక గ్రామ స్థాయిలో పంచాయతీలతో సహా) మంజూరుచేసి బట్వాడా చేయవలెను.

(5) ఉప-పరిచ్ఛేదము (1)క్రింద ప్రతియొక్క నిరుద్యోగ భృతి చెల్లింపు, అది చెల్లించవలసినప్పటి నుండి పదిహేను దినములు దాటకుండా చెల్లించవలెను లేక దానిని ఇవ్వజూపవలెను.

(6) రాజ్య ప్రభుత్వము ఈ చట్టము క్రింద నిరుద్యోగభృతి చెల్లింపు కొరకు ప్రక్రియను విహితపరచవచ్చును.

కొన్ని సందర్భములలో నిరుద్యోగ భృతి బట్వాడా చేయకుండుట.

8.(1) కార్యక్రమ అధికారి నిరుద్యోగభృతిని గడువు లోపల చెల్లించగలిగిన స్థితిలో లేనిచో లేక తన నియంత్రణలోలేని ఏదేని కారణము వలన అసలే చెల్లించలేని స్థితిలో ఉన్నచో, అతడు సదరు విషయమును జిల్లా కార్యక్రమ సమన్వయకర్తకు నివేదించవలెను మరియు నోటీసు ద్వారా అతడి నోటీసుబోర్డులో గాని, గ్రామ పంచాయితీ యొక్క నోటీసు బోర్డులో గాని మరియు తాను అవసరమని భావించునట్టి బాగుగా కన్పించునట్టి ఇతర స్థలములలో గాని అట్టి కారణములను ప్రదర్శించ వలెను.

(2) నిరుద్యోగభృతి చెల్లింపు జరగని లేక చెల్లింపు జాప్యమైన ప్రతి కేసును అట్టి చెల్లింపు జరగకుండుటకు లేక జాప్యమగుటకైన కారణములను జిల్లాకార్యక్రమ సమన్వయ కర్తచే రాజ్య ప్రభుత్వమునకు సమర్పించబడునట్టి వార్షిక నివేదికలో నివేదించ వలెను.

(3) రాజ్యప్రభుత్వము, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నివేదించిన నిరుద్యోగ భృతిని సంబంధిత కుటుంబమునకు సాధ్యమైనంత శీఘ్రముగా చెల్లించుటకు చర్యలన్నియు తీసుకొనవలెను.

కొన్ని సందర్భములలో నిరుద్యోగ భృతిని పొందుటకు హక్కు కలిగియుండకుండుట.

9.(ఎ) పథకం క్రింద తన కుటుంబమునకు కల్పించిన ఉద్యోగమును స్వీకరించని; లేక

(బి) కార్యక్రమ అధికారి లేక అమలుచేయు ఏజెన్సీచే పనిచేయుట కొరకు హాజరు కావలసినదిగా అధిసూచించిన పదిహేను దినముల లోపల పనికి హాజరుకాని; లేక

(సి) సంబంధిత అమలుచేయు ఏజెన్సీ యొక్క అనుమతి తీసుకోకుండ ఒకవారం కంటే ఎక్కువ కాలావధికి పనినుండి నిరంతరం గైరుహాజరైన లేక ఏదేని మాసములో మొత్తం ఒక వారం కంటే ఎక్కువ కాలావధికి గైరుహాజరైన;

దరఖాస్తుదారుడు ఈ చట్టము క్రింద మూడు మాసముల కాలావధికి నిరుద్యోగ భృతిని క్లెయించేయుటకు నిరర్హుడగును అయితే పథకం క్రింద ఎప్పుడైనను ఉద్యోగమును కోరుటకు అర్హత ఉండును.

## అధ్యాయము - 4

## అమలుచేయు మరియు మానిటరింగు ప్రాధికారములు

కేంద్ర ఉద్యోగ హామీ పరిషత్తు.

10.(1) కేంద్రప్రభుత్వము అధిసూచన ద్వారా నిర్దిష్టపరచునట్టి తేదీనుండి, ఈ చట్టము ద్వారా లేక దాని క్రింద దానికి అప్పగించబడిన కృత్యములను నిర్వర్తించుటకు మరియు కర్తవ్యములను నిర్వహించుటకు కేంద్ర ఉద్యోగ హామీ అని పిలువబడు పరిషత్తు-నొక దానిని ఏర్పాటుచేయవలెను.

(2) కేంద్ర పరిషత్తు యొక్క ప్రధాన కార్యస్థానము ఢిల్లీలో ఉండవలెను.

(3) కేంద్ర పరిషత్తు, కేంద్ర ప్రభుత్వముచే నియమించబడునట్టి ఈ క్రింది సభ్యులతో కూడి ఉండవలెను, వారెవరనగా:-

(ఎ) ఛైర్ పర్సన్;

(బి) ప్రణాళిక సంఘముతో సహా కేంద్ర ప్రభుత్వముచే నిర్ధారించబడునట్టి సంఖ్యకు మించకుండ భారత ప్రభుత్వ సంయుక్తకార్యదర్శి హోదాకంటే తక్కువ కాని హోదాగల కేంద్ర మంత్రిత్వ శాఖలలోని ప్రతినిధులు;

(సి) కేంద్ర ప్రభుత్వముచే నిర్ధారించబడునట్టి సంఖ్యకు మించకుండ రాజ్య ప్రభుత్వముల ప్రతినిధులు;

J-90-3

(డి) పంచాయతీరాజ్ సంస్థలు, కార్మిక వ్యవస్థలు మరియు అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యము వహించు పదిహేను మందికి మించకుండ అనధికార సభ్యులు:

అయితే, అట్టి అనధికార సభ్యులలో రొటేషను ద్వారా తడవకు ఒక సంవత్సర కాలావధికి కేంద్ర ప్రభుత్వముచే నామనిర్దేశము చేయబడిన జిల్లా పంచాయతీల చైర్ పర్సన్ లు ఇద్దరు చేరివుండవలెను.

అంతేకాక, ఈ ఖండము క్రింద నామనిర్దేశము చేయబడిన అనధికార సభ్యులలో మూడింట ఒక వంతుకు తక్కువ కానట్టి సంఖ్యలో మహిళలు ఉండవలెను.

అంతేకాకుండ, అనధికార సభ్యులలో మూడింట ఒక వంతుకు తక్కువ కానట్టి సంఖ్యలో అనుసూచిత కులములు, అనుసూచిత జనజాతులు, ఇతర వెనుకబడిన తరగతులు మరియు అల్పసంఖ్యాక వర్గములకు చెందినవారై ఉండవలెను.

(ఇ) కేంద్ర ప్రభుత్వము ఈ విషయమై నియమముల ద్వారా నిర్ధారించునట్టి సంఖ్యలో రాజ్యముల యొక్క ప్రతినిధులు;

(ఎఫ్) భారత ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి హోదా కంటే తక్కువకాని హోదాగల సభ్య కార్యదర్శి.

(4) కేంద్రపరిషత్తు చైర్ పర్సన్ ను మరియు ఇతర సభ్యులను నియమించుటకు గల నిబంధనలు మరియు షరతులకు లోబడి మరియు కేంద్రపరిషత్తు యొక్క సమావేశములు జరుగు సమయము, స్థలము మరియు ప్రక్రియ (అట్టి సమావేశములలో కోరంతో సహా) కేంద్ర ప్రభుత్వము విహితపరచబడునట్టి విధముగా ఉండవలెను.

కేంద్రపరిషత్తు యొక్క కృత్యములు మరియు కర్తవ్యములు.

11.(1) కేంద్రపరిషత్తు, ఈ క్రింది కృత్యములను నిర్వర్తించవలెను మరియు కర్తవ్యములను నిర్వహించవలెను, అవేవనగా:-

(ఎ) కేంద్ర మదింపు మరియు మానిటరింగు పద్ధతిని స్థాపించుట;

(బి) ఈ చట్టము యొక్క అమలుకు సంబంధించిన అన్ని విషయములపై కేంద్ర ప్రభుత్వమునకు సలహాలిచ్చుట;

(సి) ఆయా సమయములందు మానిటరింగు మరియు నివారణ యంత్రాంగమును పునర్విలోకనము చేయుట మరియు వాటిని మెరుగుపరచుటకు అవసరమైన సిఫార్సులను చేయుట;

(డి) ఈ చట్టము క్రింద చేసిన పథకములను గురించిన సమాచారమును సాధ్యమైనంత విస్తృతముగా వ్యాప్తిచేయుట;

(ఇ) ఈ చట్టము యొక్క అమలును మానిటరింగు చేయుట;

(ఎఫ్) ఈ చట్టము యొక్క అమలుపై కేంద్ర ప్రభుత్వముచే పార్లమెంటుకు సమర్పించబడు వార్షిక నివేదికలను తయారుచేయుట;

(జి) కేంద్ర ప్రభుత్వముచే దానికి అప్పగించబడు ఏదేని ఇతర కర్తవ్యము లేక కృత్యము నిర్వర్తించుట.

(2) కేంద్ర పరిషత్తు ఈ చట్టము క్రింద చేసిన వివిధ పథకముల మదింపు చేపట్టుటకు మరియు అందు నిమిత్తము గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరియు పథకముల అమలుకు సంబంధించిన గణాంకములను సేకరించుటకు లేక సేకరించబడునట్లు చేయుటకు అధికారము కలిగివుండును.

రాజ్య ఉద్యోగ హామీ పరిషత్తు.

12.(1) ఈ చట్టము యొక్క అమలును రాజ్య స్థాయిలో క్రమబద్ధముగా మానిటరింగు మరియు పునర్విలోకనము చేయు ప్రయోజనము నిమిత్తము, ప్రతి రాజ్య ప్రభుత్వము, ఛైర్ పర్సన్ మరియు రాజ్య ప్రభుత్వముచే నిర్ధారించబడునట్టి సంఖ్యలోని అధికార సభ్యులు మరియు పంచాయితీరాజ్ సంస్థలు, కార్మిక సంఘాలు మరియు లబ్ధిచేకూరని వర్గముల నుండి రాజ్య ప్రభుత్వముచే నామనిర్దేశము చేయబడిన పదిహేను మందికి మించకుండ అనధికార సభ్యులతో కూడిన ................(రాజ్యము యొక్క పేరు) రాజ్య ఉద్యోగ హామీ పరిషత్తు అని పిలవబడు రాజ్య పరిషత్తు నొకదానిని ఏర్పాటు చేయవలెను:

అయితే, ఈ ఖండము క్రింద నామనిర్దేశము చేయబడిన అనధికార సభ్యులలో మూడింటా ఒక వంతుకు తక్కువకానట్టి సంఖ్యలో మహిళలు ఉండవలెను:

అంతేకాక, అనధికార సభ్యులలో మూడింటా ఒకవంతు సంఖ్యకు తక్కువ కానట్టి సభ్యులు అనుసూచిత కులములు, అనుసూచిత జనజాతులు, ఇతర వెనుకబడిన తరగతులు మరియు అల్పసంఖ్యాక వర్గములకు చెందినవారై ఉండ వలెను.

(2) రాజ్య పరిషత్తు ఛైర్ పర్సన్ మరియు సభ్యులను నియమించుటకు నిబంధనలు మరియు షరతులకు లోబడి, మరియు రాజ్యపరిషత్తు యొక్క సమావేశములు జరుగు సమయము, స్థలము మరియు ప్రక్రియ (అట్టి సమావేశములలో కోరంతోసహా) రాజ్య ప్రభుత్వము విహితపరచబడునట్టి విధముగా ఉండవలెను.

(3) రాజ్య పరిషత్తు యొక్క కర్తవ్యములు మరియు కృత్యములలో;

(ఎ) పథకమునకు సంబంధించిన అన్ని విషయములు మరియు రాజ్యములో దాని అమలుపై రాజ్య ప్రభుత్వమునకు సలహాలిచ్చుట;

(బి) ప్రాధాన్యత పనులను నిర్ధారించుట;

(సి) ఆయాసమయములందు మానిటరింగు మరియు నివారణ యంత్రాంగమును పునర్విలోకనము చేయుట మరియు వాటిని మెరుగుపరచుటకు సిఫార్సులను చేయుట;

(డి) ఈ చట్టము మరియు దాని క్రింద చేసిన పథకములను గురించిన సమాచారమును సాధ్యమైనంత విస్తృతముగా వ్యాప్తి చేయుట;

(ఇ) ఈ చట్టము యొక్క అమలును మరియు రాజ్యములోని పథకములను మానిటరింగు చేయుట మరియు అట్టి అమలును కేంద్ర పరిషత్తుతో సమన్వయపరచుట;

(ఎఫ్) రాజ్య ప్రభుత్వముచే రాజ్య శాసనమండలికి సమర్పించబడు వార్షిక నివేదికను తయారుచేయుట;

(జి) కేంద్ర పరిషత్తు లేక రాజ్య ప్రభుత్వముచే దానికి-అప్పగించబడునట్టి ఏదేని ఇతర కర్తవ్యము లేక కృత్యము నిర్వర్తించుట;

చేరియుండును.

(4) రాజ్య పరిషత్తు, రాజ్యములో అమలవుతున్న పథకముల మదింపు చేపట్టుటకు మరియు అందు నిమిత్తము గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరియు రాజ్యములోని పథకములు మరియు కార్యక్రమముల అమలుకు సంబంధించిన గణాంకములను సేకరించుటకు లేక సేకరించబడునట్లు చేయుటకు అధికారము కలిగియుండును.

**పథకములను రూపొందించుటకు ప్రణాళిక రచన మరియు అమలు కొరకు ముఖ్య ప్రాధికారములు.**

13.(1) ఈ చట్టము క్రింద చేసిన పథకముల యొక్క ప్రణాళిక మరియు అమలు కొరకు జిల్లా, మధ్యస్థ మరియు గ్రామ స్థాయిలలో పంచాయితీలు ముఖ్య ప్రాధికారములుగా యుండును.

(2) జిల్లా స్థాయిలో, --

(ఎ) పథకము క్రింది కార్యక్రమము క్రింద చేపట్టవలసిన బ్లాకువారీ ప్రాజెక్టులకు తుదిరూపమిచ్చుట మరియు ఆమోదించుట;

(బి) బ్లాకు మరియు జిల్లా స్థాయిలో చేపట్టిన ప్రాజెక్టులను పర్యవేక్షించుట మరియు మానిటరు చేయుట;

(సి) రాజ్యపరిషత్తుచే ఆయా సమయములందు వాటికి అప్పగించబడునట్టి ఇతర కృత్యములను నిర్వర్తించుట;

పంచాయితీల కృత్యములై యుండును.

(3) మధ్యస్థ స్థాయిలో, -

(ఎ) జిల్లా స్థాయిలో అంతిమ ఆమోదము కొరకు జిల్లా పంచాయితీకి పంపించుట కొరకు బ్లాకు స్థాయి ప్రణాళికను ఆమోదించుట;

(బి) గ్రామపంచాయితీ మరియు బ్లాకుస్థాయిలో చేపట్టిన ప్రాజెక్టులను పర్యవేక్షించుట మరియు మానిటరింగు చేయుట;

(సి) రాజ్య పరిషత్తుచే దానికి అప్పగించబడునట్టి ఇతర కృత్యములను నిర్వర్తించుట;

పంచాయితీ కృత్యములై యుండును.

(4) జిల్లా కార్యక్రమ సమన్వయకర్త, ఈ చట్టము క్రింది కృత్యములను నిర్వర్తించుటలో మరియు దానిక్రింద చేసిన ఏదేని పథకమును అమలుపరచుటలో జిల్లా స్థాయిలో పంచాయితీకి సహాయం అందించవలెను.

జిల్లా కార్యక్రమ సమన్వయకర్త.

14.(1) జిల్లా పంచాయితీ యొక్క ముఖ్య కార్యనిర్వహణాధికారిని గాని, లేక జిల్లా కలెక్టరునుగాని, లేక రాజ్య ప్రభుత్వము నిర్ణయించునట్టి సముచితమైన హోదాగల ఎవరేని ఇతర జిల్లాస్థాయి అధికారినిగాని జిల్లాలో పథకము యొక్క అమలు కొరకు జిల్లా కార్యక్రమ సమన్వయకర్తగా నియోగించవలెను.

(2) జిల్లా కార్యక్రమ సమన్వయకర్త, ఈ చట్టము యొక్క నిబంధనలు మరియు దాని క్రింద చేసిన నియమములననుసరించి జిల్లాలో పథకము యొక్క అమలు కొరకు బాధ్యతవహించవలెను.

(3) (ఎ) ఈ చట్టము క్రింద తన కృత్యములను నిర్వర్తించుటలో మరియు దాని క్రింద చేసిన ఏదేని పథకమును అమలు చేయుటలో జిల్లా పంచాయితీకి సహాయము చేయుట;

(బి) జిల్లా స్థాయిలో పంచాయితీచే ఆమోదించబడవలసి ఉన్నట్టి ప్రాజెక్టులలో చేర్చుటకు ఇతర అమలు ఏజెన్సీల నుండి అందిన ప్రాజెక్టు ప్రతిపాదనలు మరియు బ్లాకు స్థాయిలో తయారు చేయబడిన ప్రణాళికలను ఏకీకరణ చేయుట;

(సి) అవసరమైనచోట్ల అవసరమైన మంజూరీని మరియు పరిపాలనపరమైన క్లియరెన్సును ఇచ్చుట;

(డి) ఈ చట్టము క్రింద వారికి ఉన్నట్టి హక్కుల కనుగుణంగా దరఖాస్తుదారులకు ఉద్యోగం కల్పించబడునట్లుగా చూచుటకు, తన అధికారితా పరిధిలో పని చేయుచున్న కార్యక్రమ అధికారులతో మరియు అమలు ఏజెన్సీలతో సమన్వయించుట;

(ఇ) కార్యక్రమ అధికారుల పనితీరును పునర్విలోకనము చేయుట, మానిటరు చేయుట మరియు పర్యవేక్షించుట;

(ఎఫ్) జరుగుతున్న పనుల యొక్క నియతకాలిక తనిఖీని నిర్వహించుట;

(జి) దరఖాస్తుదారుల ఇబ్బందులను పరిష్కరించుట;

జిల్లా కార్యక్రమ సమన్వయకర్త యొక్క కృత్యములైయుండును.

J-90-4

(4) రాజ్య ప్రభుత్వము, ఈ చట్టము క్రింద జిల్లా కార్యక్రమ సమన్వయకర్త తన కృత్యములను నిర్వర్తించుటకు వీలుగా అతనికి అవసరమైనట్టి పరిపాలనపరమైన మరియు ఆర్థికపరమైన అధికారములను ప్రత్యాయోజనము చేయవలెను.

(5) 15వ పరిచ్ఛేదము యొక్క ఉపపరిచ్ఛేదము (1) క్రింద నియమించబడిన కార్యక్రమ అధికారి మరియు జిల్లాలో పనిచేయుచున్న రాజ్య ప్రభుత్వము యొక్క ఇతర అధికారులు, స్థానిక ప్రాధికారములు మరియు నికాయములు, ఈ చట్టము క్రింద తన కృత్యములను నిర్వర్తించుటలో మరియు దాని క్రింద చేసిన పథకములను అమలు చేయుటలో జిల్లా కార్యక్రమ సమన్వయకర్తకు సహాయం అందించుటకు బాధ్యత వహించ వలెను.

(6) జిల్లా కార్యక్రమ సమన్వయకర్త, ప్రతి సంవత్సరము డిశంబరు మాసములో తదుపరి ఆర్థిక సంవత్సరము కొరకు జిల్లాలో నైపుణ్యరహితచేతిపని కొరకు ఊహించిన అభ్యర్థన వివరములను కలిగియున్నట్టి కార్మిక బడ్జెటును మరియు పథకము క్రింద పనులలో కార్మికుల నియామకము కొరకైన ప్రణాళికను తయారుచేయవలెను మరియు దానిని జిల్లా పంచాయితీకి సమర్పించవలెను.

కార్యక్రమ అధికారి.

15.(1) రాజ్య ప్రభుత్వము, మధ్యస్థ స్థాయిలోని ప్రతియొక పంచాయితీలో రాజ్య ప్రభుత్వముచే నిర్ధారించబడునట్టి అర్హతలు మరియు అనుభవము ఉన్నట్టి బ్లాకు అభివృద్ధి అధికారి హోదాకంటే తక్కువకాని హోదాగల వ్యక్తిని, కార్యక్రమ అధికారిగా నియమించ వలెను.

(2) కార్యక్రమ అధికారి, ఈ చట్టము క్రింద తన కృత్యములను నిర్వర్తించుటలో మరియు దానిక్రింద చేసిన పథకమును అమలుచేయుటలో మధ్యస్థ స్థాయిలోని పంచాయి-తీకి సహాయము చేయవలెను.

(3) కార్యక్రమ అధికారి, తన అధికారితా పరిధి క్రింది ప్రాంతములోని ప్రాజెక్టుల నుండి ఉత్పన్నమైన ఉద్యోగఅవకాశములతో అభ్యర్థనకు సరిపడా ఉద్యోగమును కల్పించుట కొరకు బాధ్యతవహించవలెను.

(4) కార్యక్రమ అధికారి, తన అధికారితా పరిధి క్రిందిబ్లాకు కొరకు, గ్రామ పంచాయితీల ద్వారా తయారు చేయబడిన ప్రాజెక్టు ప్రతిపాదనలను మరియు మధ్యస్థ పంచాయితీల నుండి అందిన ప్రతిపాదనలను ఏకీకరణ చేయుట ద్వారా ప్రణాళిక నొకదానిని తయారుచేయవలెను.

(5) కార్యక్రమ అధికారి యొక్క కృత్యములలో,-

(ఎ) గ్రామ పంచాయితీలు మరియు బ్లాకులోని ఇతర అమలు ఏజెన్సీలు చేపట్టిన ప్రాజెక్టులను మానిటరింగు చేయుట;

(బి) అర్హమైన కుటుంబములకు నిరుద్యోగ భృతిని మంజూరుచేయుట మరియు చెల్లింపు జరుగునట్లు చూచుట;

(సి) బ్లాకులోని పథకము యొక్క కార్యక్రమం క్రింద నియమించబడిన కార్మికులందరికి సత్వరముగాను మరియు సముచితముగాను వేతనములు చెల్లించబడునట్లు చూచుట;

(డి) గ్రామ పంచాయితీ యొక్క అధికారితా పరిధిలోని పనులన్నింటికి గ్రామసభ ద్వారా సామాజిక ఆడిటు జరుగునట్లుచూచుట మరియు సామాజిక ఆడిటులో లేవనెత్తిన అభ్యంతరములపై సముచితమైన చర్య తీసుకొనునట్లు చూచుట;

(ఇ) బ్లాకు లోపల పథకము అమలుకు సంబంధించి ఉత్పన్నమగు ఫిర్యాదులన్నింటిలో న్యాయముగా వ్యవహరించుట;

(ఎఫ్) జిల్లా కార్యక్రమ సమన్వయకర్త లేక రాజ్య ప్రభుత్వముచే అతడికి అప్పగించబడునట్టి ఏదేని ఇతర పని;

చేరియుండును.

(6) కార్యక్రమ అధికారులు, జిల్లా కార్యక్రమ సమన్వయకర్త యొక్క ఆదేశము, నియంత్రణ మరియు అధీక్షణ క్రింద పనిచేయవలెను.

(7) రాజ్య ప్రభుత్వము, కార్యక్రమ అధికారి యొక్క కృత్యములన్నియు లేక అందులో కొన్ని కృత్యములు గ్రామ పంచాయితీ లేక స్థానిక ప్రాధికారముల ద్వారా నిర్వర్తించబడాలని ఉత్తరువు ద్వారా ఆదేశించవచ్చును.

గ్రామ పంచాయితీల బాధ్యతలు.

16.(1) గ్రామ పంచాయితీ, గ్రామసభ మరియు వార్డు సభల యొక్క సిఫార్సుల ప్రకారం గ్రామ పంచాయితీలో ఈపథకము క్రింద చేపట్టవలసిన ప్రాజెక్టులను గుర్తించుటకు మరియు వాటిని నిర్వహించుటకు మరియు అట్టి పనులను పర్యవేక్షించుటకు బాధ్యత వహించవలెను.

(2) గ్రామ పంచాయితీ, గ్రామ పంచాయితీ ప్రాంతములో కార్యక్రమ అధికారిచే మంజూరు చేయబడునట్టి పథకము క్రింద ఏ ప్రాజెక్టునైనను చేపట్టవచ్చును.

(3) ప్రతియొక గ్రామపంచాయితీ, గ్రామసభ మరియు వార్డుసభల యొక్క సిఫార్సులను పర్యాలోచించిన తరువాత అభివృద్ధి ప్రణాళికను తయారు చేయవలెను మరియు పనికొరకు అభ్యర్థన ఏర్పడినపుడు ఎప్పుడైనను పథకము క్రింద చేపట్టదగిన సాధ్యమైన పనుల జాబితాను నిర్వహించవలెను.

(4) గ్రామ పంచాయితీ, ఏ సంవత్సరములో వివిధ రకముల పనులు అమలు చేయుటకు ప్రతిపాదించబడినాయో ఆ సంవత్సర ప్రారంభమునకు పూర్వం సదరు పనుల ప్రాధాన్యతా క్రమముతో సహా అభివృద్ధి పనుల కొరకైన తమ ప్రతిపాదనలను పరిశీలన మరియు ప్రారంభ ఆమోదము కొరకు కార్యక్రమ అధికారికి పంపవలెను.

(5) కార్యక్రమ అధికారి, గ్రామ పంచాయితీల ద్వారా అమలుచేయవలసినట్టి పథకము క్రింద కనీసం యాభైశాతం పనులను వాటికయ్యే ఖర్చుల పరిమితి కనుగుణంగా కేటాయించవలెను.

(6) కార్యక్రమ అధికారి;

(ఎ) మంజూరై దానిచే అమలుచేయవలసి ఉన్నట్టి పనులకొరకు హాజరు పట్టీలను, మరియు

(బి) గ్రామపంచాయితీలో నివసించువారికి వేరేచోట లభ్యమయ్యే ఉద్యోగ అవకాశముల జాబితాను ప్రతి పంచాయితీకి సరఫరా చేయవలెను.

(7) గ్రామ పంచాయితీ, దరఖాస్తుదారుల మధ్య ఉద్యోగ అవకాశములను కేటాయించవలెను. మరియు వారికి పనికి హాజరు కావలెనని తెలియజేయవలెను.

(8) పథకము క్రింద గ్రామపంచాయితీ ద్వారా చేపట్టబడిన పనులు అవసరమైన సాంకేతిక ప్రమాణములు మరియు కొలతల కనుగుణంగా జరుగవలెను.

**గ్రామసభ ద్వారా పనుల సామాజిక ఆడిటు.**

17.(1) గ్రామ సభ, గ్రామ పంచాయితీలోని పనుల అమలును మానిటరు చేయవలెను.

(2) గ్రామసభ, గ్రామపంచాయితీలో చేపట్టిన పథకము క్రింది ప్రాజెక్టులన్నింటిని క్రమబద్ధముగా సామాజిక ఆడిట్లను నిర్వహించవలెను.

(3) గ్రామపంచాయితీ, సామాజిక ఆడిటు నిర్వహించు నిమిత్తం, హాజరుపట్టీలు, బిల్లులు, ఓచర్లు, కొలతల పుస్తకములు, మంజూరీ ఉత్తరువుల ప్రతులు మరియు ఇతర సంబంధిత లెక్కల పుస్తకములు మరియు పత్రములతోసహా అన్ని సంబంధిత పత్రములను గ్రామసభకు అందజేయవలెను.

**పథకమును అమలుచేయుటలో రాజ్యప్రభుత్వము యొక్క బాధ్యతలు.**

18. రాజ్య ప్రభుత్వము, జిల్లా కార్యక్రమ సమన్వయకర్త మరియు కార్యక్రమ అధికారులకు పథకమును పటిష్టముగా అమలుచేయుటకు అవసరమైన సిబ్బంది మరియు సాంకేతిక సహాయమును సమకూర్చవలెను.

ఇబ్బంది నివారణ యంత్రాంగము.

19. రాజ్య ప్రభుత్వము, పథకము అమలుకు సంబంధించి ఎవరేని వ్యక్తి చేసిన ఫిర్యాదును పరిశీలించుట కొరకు బ్లాకు స్థాయిలో లేక జిల్లా స్థాయిలో నియమముల ద్వారా సముచితమైన ఇబ్బంది నివారణ యంత్రాంగములను నిర్ధారణ చేయవలెను మరియు అట్టి ఫిర్యాదులను పరిష్కరించుట కొరకు ప్రక్రియను రూపొందించవలెను.

అధ్యాయము - 5

జాతీయ మరియు రాజ్య ఉద్యోగ హామీ నిధుల స్థాపన మరియు ఆడిటు.

జాతీయ ఉద్యోగ హామీ నిధి.

20.(1) కేంద్ర ప్రభుత్వము, అధిసూచన ద్వారా ఈ చట్టము యొక్క ప్రయోజనముల నిమిత్తం, జాతీయ ఉద్యోగహామీ నిధి అని పిలువబడు నిధినొకదానిని స్థాపించవలెను.

(2) కేంద్ర ప్రభుత్వము, ఈ విషయమై శాసనము ద్వారా పార్లమెంటుచే తగు వినియోజనము తరువాత కేంద్ర ప్రభుత్వము అవసరమని భావించునట్టి డబ్బు మొత్తములను గ్రాంట్లు లేక రుణముల రూపేణా జాతీయ నిధికి జమచేయవలెను.

(3) జాతీయ నిధికి జమచేసిన మొత్తమును కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్టి రీతిలో మరియు అట్టి షరతులు మరియు పరిమితులకు లోబడి వినియోగించవలెను.

రాజ్య ఉద్యోగ హామీ నిధి.

21.(1) రాజ్య ప్రభుత్వము, అధిసూచన ద్వారా పథకమును అమలుచేయు నిమిత్తం, రాజ్య ఉద్యోగ హామీనిధి అని పిలువబడు నిధినొకదానిని ఏర్పాటు చేయవలెను.

(2) రాజ్య నిధికి జమ అయిన మొత్తమును ఈ చట్టము యొక్క అమలు నిమిత్తం మరియు దాని క్రింద చేసిన పథకములు మరియు ఈ చట్టమునకు సంబంధించిన పరిపాలనాపరమైన ఖర్చులను భరించుట కొరకు రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి రీతిలో మరియు అట్టి షరతులు మరియు పరిమితులకు లోబడి వ్యయము చేయవలెను.

(3) రాజ్య నిధిని, అట్టి ప్రాధికారము కలిగియుండి రాజ్య ప్రభుత్వము తరఫున రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి రీతిలో నిర్వహించవలెను.

నిధుల కేటాయింపు.

22.(1) కేంద్ర ప్రభుత్వముచే ఈవిషయమై చేయబడునట్టి నియమములకు లోబడి, కేంద్ర ప్రభుత్వము ఈక్రింద తెలిపిన ఖర్చులను భరించవలెను, అవేవనగా:-

(ఎ) పథకము క్రింద నైపుణ్యరహిత శారీరక శ్రమ కొరకైన వేతనముల చెల్లింపు కొరకు అవసరమైన మొత్తము;

J-90-5

(బి) అనుసూచి-2 యొక్క నిబంధనలకు లోబడి నైపుణ్యము గల మరియు పాక్షిక నైపుణ్యంగల కార్మికులకు వేతనముల చెల్లింపుతో సహా పథకము యొక్క సామాగ్రి ఖర్చులో నాలుగింటా మూడువంతుల వరకు;

(సి) పథకము యొక్క మొత్తముఖర్చులో కేంద్ర ప్రభుత్వముచే నిర్ధారించబడు నట్టి శాతంలో పరిపాలనపరమైన ఖర్చుల కొరకు వ్యయం చేయవచ్చును, అందులో కార్యక్రమ అధికారులు మరియు ఆయన సహాయ సిబ్బంది యొక్క జీతభత్యములు, కేంద్ర పరిషత్తు యొక్క పరిపాలనాపరమైన ఖర్చులు, అనుసూచి-2 క్రింద సమకూర్చిన సౌకర్యములు మరియు కేంద్ర ప్రభుత్వముచే నిర్ణయించబడునట్టి ఇతర అంశము చేరి ఉండవచ్చును.

(2) రాజ్య ప్రభుత్వము, ఈక్రింద తెలిపిన ఖర్చులను భరించవలెను, అవేవనగా:-

(ఎ) పథకము క్రింద చెల్లించవలసిన నిరుద్యోగ భృతి ఖర్చు;

(బి) అనుసూచి-2 యొక్క నిబంధనలకు లోబడి నైపుణ్యం గల మరియు పాక్షిక నైపుణ్యం గల కార్మికులకు వేతనముల చెల్లింపుతో సహా పథకము యొక్క సామాగ్రి ఖర్చులో నాలుగింటా ఒక వంతు;

(సి) రాజ్య పరిషత్తు యొక్క పరిపాలనాపరమైన ఖర్చు.

పారదర్శకత మరియు జవాబుదారీతనం.

23.(1) జిల్లాలోని జిల్లా కార్యక్రమ సమన్వయకర్త మరియు జిల్లాలోని అన్ని అమలు ఏజెన్సీలు, పథకము అమలు నిమిత్తం వారి వద్ద ఉంచిన నిధుల సక్రమ వినియోగము మరియు నిర్వహణకు బాధ్యత వహించవలెను.

(2) రాజ్య ప్రభుత్వము, కార్మికుల యొక్క ఉద్యోగ మరియు ఈ చట్టము యొక్క నిబంధనలు మరియు దాని క్రింద చేసిన పథకముల అమలుకు సంబంధించి భరించిన వ్యయము యొక్క సక్రమమైన పుస్తకముల మరియు లెక్కల నిర్వహణా రీతిని విహితపరచవచ్చును.

(3) రాజ్యప్రభుత్వము, పథకము యొక్క సక్రమఅమలు మరియు పథకము క్రింది కార్యక్రమముల కొరకు మరియు పథకముల అమలులో అన్ని స్థాయిలలో పారదర్శకత మరియు జవాబుదారీతనం యుండునట్లు జాగ్రత్త వహించుటకు చేయవలసిన ఏర్పాట్లను నిర్ధారించవచ్చును.

23.(4) వేతనములన్నియు నగదురూపములో చెల్లించవలెను మరియు నిరుద్యోగ భృతి ముందుగా ప్రకటించిన తేదీలలో సమాజంలోని స్వతంత్ర వ్యక్తుల సమక్షంలో సంబంధిత వ్యక్తికి నేరుగా చెల్లించవలెను.

(5) గ్రామ పంచాయితీ పథకము యొక్క అమలుకు సంబంధించి ఏదేని వివాదము లేక ఫిర్యాదు చేసినచో, విషయమును కార్యక్రమ అధికారికి నిర్దేశించ వలెను.

(6) కార్యక్రమ అధికారి, ప్రతి ఫిర్యాదును అతనిచే నిర్వహించబడు ఫిర్యాదుల రిజిష్టరులో నమోదు చేయవలెను, మరియు వాటిని స్వీకరించిన ఏడు దినములలోపల వివాదములను మరియు ఫిర్యాదులను పరిష్కరించవలెను మరియు విషయము ఎవరేని ఇతర ప్రాధికారముచే పరిష్కరించవలసియున్నసందర్భములో దానిని ఫిర్యాదుదారుడికి తెలుపుతూ అట్టి ప్రాధికారమునకు పంపవలెను.

లెక్కల ఆడిటు.

24.(1) కేంద్ర ప్రభుత్వము, భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరల్ తో సంప్రదించి, అన్ని స్థాయిలలో పథకముల యొక్క లెక్కల ఆడిట్ కొరకు సముచితమైన ఏర్పాట్లను విహితపరచవచ్చును.

(2) పథకముల యొక్క లెక్కలు, రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి ప్రరూపము మరియు రీతిలో నిర్వహించవలెను.

## అధ్యాయము - ౬
## వివిధములు

పాటించనందుకు శాస్తి.

25. ఈ చట్టము యొక్క నిబంధనలను ఉల్లంఘించు వారెవరైనను, దోషస్థాపన జరిగిన మీదట ఒక వేయి రూపాయల దాకా ఉండగల జరిమానాకు పాత్రుడగును.

ప్రత్యాయోజనము చేయుటకు అధికారము.

26.(1) కేంద్ర ప్రభుత్వము, (నియమములను చేయుటకైన అధికారముల మినహా) దానిచే వినియోగించదగిన అధికారములను అధిసూచన ద్వారా అందులో నిర్దిష్టపరచునట్టి పరిస్థితులలోను మరియు అట్టి షరతులు మరియు పరిమితులకు లోబడి రాజ్య ప్రభుత్వము లేక కేంద్ర ప్రభుత్వమునకు లేక రాజ్య ప్రభుత్వమునకు అధీనస్థుడైన అధికారి కూడా వినియోగించవచ్చునని ఆదేశించవచ్చును.

(2) రాజ్య ప్రభుత్వము, (నియమములు మరియు పథకములు చేయుటకైన అధికారముల మినహా) దానిచే వినియోగించదగిన అధికారములను అధిసూచన ద్వారా నిర్దిష్టపరచునట్టి పరిస్థితులలోను మరియు అట్టి షరతులు మరియు పరిమితులకు లోబడి, దానికి అధీనస్థుడైన అధికారి కూడా వినియోగించవచ్చని ఆదేశించవచ్చును.

ఆదేశములిచ్చుటకు కేంద్ర ప్రభుత్వమునకు అధికారము.

27.(1) కేంద్ర ప్రభుత్వము, ఈ చట్టము యొక్క నిబంధనలను పటిష్టముగా అమలు చేయుట కొరకు రాజ్య ప్రభుత్వమునకు తాము అవసరమని భావించునట్టి ఆదేశములను ఈయవచ్చును.

(2) ఉప-పరిచ్ఛేదము (1) యొక్క నిబంధనలకు భంగము కలుగకుండ, కేంద్ర ప్రభుత్వము, ఏదేని పథకమునకు సంబంధించి ఈచట్టము క్రిందమంజూరైన నిధుల జారీ లేక వాటి అనుచిత వినియోగమును గూర్చిన ఏదేని ఫిర్యాదు అందిన మీదట, ప్రథమ దృష్ట్యా కేసుఉన్నదని సంతృప్తిచెందినచో, దానిచే నియోగించబడినట్టి ఏదేని ఏజెన్సీచే సదరు ఫిర్యాదుపై దర్యాప్తు చేయించవలెను మరియు అవసరమైనచో అట్టి పథకమునకు నిధుల విడుదలను నిలిపివేయుమని ఉత్తరువును ఈయవచ్చును మరియు దానిని సక్రమంగా అమలుచేయుట కొరకు యుక్తమైన కాలావధి లోపల సముచిత నివారణ చర్యలను ప్రారంభించ వచ్చును.

చట్టమును అధిగమించు ప్రభావమును కలిగి యుండుట.

28. ఈ చట్టము యొక్క నిబంధనలు లేక దాని క్రింద చేసిన పథకములు, తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర శాసనములో లేక అట్టి శాసనప్రభావం కలిగిఉన్నట్టి ఏదేని పత్రములో అందుకు అసంగతముగా ఏమి ఉన్నప్పటికిని ప్రభావము కలిగివుండును:

అయితే, నైపుణ్యరహిత శారీరక శ్రమచేసే గ్రామీణ కుటుంబముల కొరకు ఉద్యోగ హామీని కల్పించుటకు ఈ చట్టము యొక్క నిబంధనలకు సంగతముగా రాజ్యశాసనము అమలులో ఉన్నయెడల లేక రాజ్యశాసనము చేసియుండి అందులో కుటుంబములకు కల్పించిన హక్కులు మరియు ఉద్యోగ షరతులు ఈ చట్టము క్రింద హామీ ఈయబడిన వాటికంటే తక్కువ కాకుండయుండి ఉన్నయెడల, రాజ్య ప్రభుత్వము, తమ స్వంత శాసనమును అమలుచేసుకొను స్వేచ్ఛ కలిగియుండును:

అంతేకాక, అట్టి సందర్భములలో కేంద్ర ప్రభుత్వముచే నిర్ధారించబడునట్టి రీతిలో సంబంధిత రాజ్య ప్రభుత్వముకు ఆర్థికసహాయముఅందించవలెను, అయితే, అది ఈ చట్టము క్రింద చేసిన పథకమును సదరు రాజ్యము అమలుచేసియుండినచో ఈ చట్టము క్రింద అది ఎంత ఆర్థికసహాయము పొందుటకు హక్కు కలిగియుండెడిదో అంతకంటే మించరాదు.

అనుసూచీలను సవరించుటకు అధికారము.

29.(1) కేంద్ర ప్రభుత్వము, వెంటనే అట్లు చేయుట అవసరమని సంతృప్తి చెందినచో, అది అధిసూచన ద్వారా అనుసూచి-1 లేక అనుసూచి-2లను సవరించవచ్చును. మరియు అటుమీదట అనుసూచి-1 లేక సందర్భానుసారముగా అనుసూచి-2లు తదనుసారముగా సవరించబడినట్లు భావించబడవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము(1) క్రింద చేసిన ప్రతియొక్క అధిసూచన ప్రతిని, దానిని చేసిన వెనువెంటనే పార్లమెంటు యొక్క ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను.

సద్భావముతో తీసుకొనిన చర్యకు రక్షణ. 1860లోని 45వది.

30. ఈ చట్టము లేక దాని క్రింద చేసిన నియమములు లేక పథకములననుసరించి సద్భావముతో చేసిన లేదా చేయుటకు ఉద్దేశించిన దేనికైనను భారత శిక్షాస్మృతి 21వ పరిచ్ఛేదము యొక్క అర్థములో పబ్లిక్ సేవకుడైన లేక పబ్లిక్ సేవకుడిగా భావించబడు జిల్లా కార్యక్రమ సమన్వయకర్త, కార్యక్రమ అధికారి లేక ఎవరేని ఇతర వ్యక్తిపై ఎట్టి దావా, అభియోగము లేదా ఇతర శాసనిక చర్య ఉండరాదు.

నియమములు చేయుటకు కేంద్ర ప్రభుత్వమునకు అధికారము.

31.(1) కేంద్రప్రభుత్వము, అధిసూచన ద్వారా మరియు పూర్వ ప్రచురణ షరతుకు లోబడి, ఈ చట్టము యొక్క నిబంధనలను నెరవేర్చుటకు నియమములు చేయవచ్చును.

(2) ముఖ్యముగాను మరియు పైన పేర్కొనబడిన అధికారము యొక్క వ్యాపకతకు భంగము వాటిల్లకుండ అట్టి నియమములు, ఈ క్రింది అన్ని లేదా ఏవేని విషయముల కొరకు నిబంధించవచ్చును, అవేవనగా:-

(ఎ) 10వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదము (3)లోగల ఖండము (ఇ) క్రింద రాజ్య ప్రభుత్వముల ప్రతినిధుల సంఖ్య;

(బి) 10వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (4) క్రింద ఏ నిబంధనలు మరియు షరతులకు లోబడి కేంద్ర పరిషత్తు ఛైర్మను మరియు ఇతర సభ్యులను నియమించవచ్చునో ఆ నిబంధనలు మరియు షరతులు, మరియు కేంద్ర పరిషత్తు యొక్క సమావేశముల (అట్టి సమావేశములలో కోరంతో సహా) సమయము, స్థలము మరియు ప్రక్రియ;

(సి) 20వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదము (3) క్రింద ఇవ్వబడిన రీతిలో మరియు ఆ షరతులు మరియు పరిమితులకు లోబడి జాతీయ నిధిని వినియోగించవలెను.

(డి) 22వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము(1) క్రింద కొన్ని అంశములపై ఖర్చులను భరించుటకు నిధుల కేటాయింపుకు సంబంధించిన నియమములు;

(ఇ) కేంద్ర ప్రభుత్వముచే నియమముల ద్వారా విహితపరచవలసిన లేక విహితపరచబడునట్టి ఏదేని నిబంధనకు సంబంధించిన ఏదేని ఇతర విషయము.

నియమములు చేయుటకు రాజ్య ప్రభుత్వమునకు అధికారము.

32.(1) రాజ్య ప్రభుత్వము, అధిసూచన ద్వారా పూర్వ ప్రచురణ షరతుకు లోబడి, ఈ చట్టమునకు మరియు కేంద్ర ప్రభుత్వముచే చేయబడిన నియమములకు అనుగుణంగా, ఈ చట్టము యొక్క నిబంధనలను నెరవేర్చుటకు నియమములను చేయవచ్చును.

J-90-6

(2) ముఖ్యముగాను మరియు పైన పేర్కొనబడిన అధికారము యొక్క వ్యాపకతకు భంగము కలుగకుండ అట్టి నియమములు ఈ క్రింది అన్ని లేక ఏవేని విషయముల కొరకు నిబంధించవచ్చును, అవేవనగా:-

(ఎ) 7వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము(2) క్రింద నిరుద్యోగ భృతి అర్హత కొరకు నిర్ధారించవలసిన నిబంధనలు మరియు షరతులు;

(బి) 7వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (6) క్రింద నిరుద్యోగ భృతి చెల్లింపు కొరకైన ప్రక్రియ;

(సి) 12వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ఏ నిబంధనలు మరియు షరతులకు లోబడి రాజ్య పరిషత్తుకి ఛైర్ పర్సన్ ను మరియు రాజ్యపరిషత్తు సభ్యులను నియమించవచ్చునో ఆనిబంధనలు మరియు షరతులు మరియు (అట్టి సమావేశములకు కోరంతోసహా) సమావేశముల సమయము, స్థలము మరియు ప్రక్రియ;

(డి) బ్లాకు మరియు జిల్లా స్థాయిలో ఇబ్బంది నివారణ యంత్రాంగము మరియు 19వ పరిచ్ఛేదము క్రింద అనుసరించవలసిన ప్రక్రియ;

(ఇ) 21వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము(2) క్రింద ఇవ్వబడిన రీతిలోను మరియు ఆ షరతులు మరియు పరిమితులకు లోబడి రాజ్యనిధిని వినియోగించవలెను.

(ఎఫ్) 21వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము(3) క్రింద రాజ్యనిధిని నిర్వహించవలసిన ప్రాధికారి మరియు రీతి;

(జి) 23వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (2) క్రింద కార్మికుల ఉద్యోగ మరియు వ్యయము యొక్కలెక్కల పుస్తకములను నిర్వహించవలసిన రీతి;

(హెచ్) 23వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము(3) క్రింద పథకముల సక్రమ అమలు కొరకు అవసరమైన ఏర్పాట్లు;

(ఐ) 24వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (2) క్రింద పథకము యొక్క లెక్కలను నిర్వహించవలసిన ప్రరూపము మరియు రీతి;

(జె) రాజ్య ప్రభుత్వముచే నియమముల ద్వారా విహితపరచవలసిన లేక విహితపరచబడునట్టి ఏదేని నిబంధనకు సంబంధించిన ఏదేని ఇతర విషయము.

...ములను ...ము పథకము ...ను (పార్లమెంటు ...సమక్షమున) ఉంచుట.

33.(1) ఈ చట్టము క్రింద కేంద్ర ప్రభుత్వముచే చేయబడిన ప్రతి నియమమును, అది చేయబడిన పిమ్మట వీలయినంత త్వరితముగ, పార్లమెంటు అధివేశనములోనున్న సమయమున, మొత్తము ముప్పది దినముల కాలావధిపాటు దాని ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను. ఆ ముప్పది దినములు, ఒకే అధివేశనములోగాని, రెండు లేక

అంతకు మించిన వెనువెంటనే వచ్చు అధివేశనములలోగాని చేరియుండవచ్చును. మరియు పైన చెప్పబడిన అధివేశనమునకు లేక వరుసగా వచ్చు అధివేశనములకు వెనువెంటనే వచ్చు అధివేశనము ముగియుటకు పూర్వమే ఆ నియమములో ఏదేని మార్పుచేయుటకు ఉభయ సదనములు అంగీకరించినచో లేక ఆ నియమము చేయరాదని ఉభయసదనములు అంగీకరించినచో అటు పిమ్మట ఆ నియమము అట్టి మార్పు చేయబడిన రూపములో మాత్రమే ప్రభావము కలిగియుండును, లేక సందర్భానుసారముగ, ప్రభావరహితమైయుండును, అయినప్పటికినీ ఆ నియమమునందలి ఏదేని అట్టి మార్పు గాని, ఆ నియమపు రద్దుగాని అంతకు పూర్వము ఆ నియమము క్రింద చేయబడిన దేని శాసనమాన్యతకైనను భంగము కలిగించరాదు.

(2) ఈ చట్టము క్రింద రాజ్య ప్రభుత్వముచే చేయబడిన ప్రతి నియమమును లేక పథకమును అది చేయబడిన పిమ్మట వీలైనంత త్వరితముగా రాజ్య శాసన మండలికి రెండు సదనములు ఉన్నయెడల దాని ప్రతియొక్క సదనము సమక్షమున మరియు ఒకే సదనము ఉన్నయెడల ఆ సదనపు సమక్షమున ఉంచవలెను.

ఇబ్బందులను తొలగించుటకు అధికారము.

34.(1) ఈ చట్టపు నిబంధనలను అమలుచేయుటలో ఏదేని ఇబ్బంది ఏర్పడినచో, ఆ ఇబ్బందిని తొలగించుటకు, ఆవశ్యకమని లేక ఉపయుక్తమని తమకు తోచునట్లుగా ఈ చట్టపు నిబంధనలకు అసంగతము కానట్టి నిబంధనలను కేంద్ర ప్రభుత్వము, రాజపత్రములో ఉత్తరువు ద్వారా చేయవచ్చును.

అయితే, ఈ చట్టము ప్రారంభమైన మూడు సంవత్సరములు ముగిసిన తరువాత ఈ పరిచ్ఛేదము క్రింద అట్టి ఉత్తరువు దేనిని గాని చేయరాదు.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద చేసిన ప్రతియొక ఉత్తరువును, దానిని చేసిన తరువాత వీలైనంత త్వరలో పార్లమెంటు యొక్క ప్రతియొక్క సదనము సమక్షమున ఉంచవలెను.

## అనుసూచి - 1

(పరిచ్ఛేదము 4(3) చూడుము)

### గ్రామీణ ఉద్యోగ హామీ పథకము యొక్క కనీస లక్షణాలు

1. పథకము దృష్టి అంతయు ఈ క్రింది పనులపై వాటి ప్రాధాన్యతా క్రమానుసారముగ ఉండును:-
   - (i) జలసంరక్షణ మరియు నీటి పొదుపు;
   - (ii) కరువు నిరోధము (అడవులపెంపకం మరియు చెట్లు నాటుటతో సహా)
   - (iii) సూక్ష్మ మరియు చిన్నతరహా నీటిపారుదల పనులతో సహా నీటిపారుదల కాలువలు;
   - (iv) అనుసూచిత కులములు మరియు అనుసూచిత జనజాతులకు చెందిన కుటుంబముల స్వంత భూమికి లేక భూసంస్కరణల లబ్దిదారుల భూమికి లేక భారత ప్రభుత్వము యొక్క ఇందిర ఆవాస్ యోజనా క్రింది లబ్దిదారుల భూమికి సాగు సౌకర్యము ఏర్పాటు చేయుట;
   - (v) చెరువుల పూడిక తీయుటతో సహా పరంపరానుగత జలాశయముల పునరుద్ధరణ;
   - (vi) భూమి అభివృద్ధి;
   - (vii) నీరు నిల్వవున్న ప్రాంతములలో మురుగునీటి పారుదలతో సహా వరద నియంత్రణ మరియు సంరక్షణ పనులు;
   - (viii) వాతావరణ సమాచారమును అందుబాటులో తేవడానికి గ్రామాలను కలుపుట;
   - (ix) రాజ్య ప్రభుత్వమును సంప్రదించి కేంద్ర ప్రభుత్వము ద్వారా అధిసూచించ బడునట్టి ఏదేని ఇతర పని.
2. శాశ్వతమైన ఆస్తులను సృష్టించుట మరియు గ్రామీణ పేదల జీవనోపాధి వనరులను బలోపేతము చేయుట పథకము యొక్క ముఖ్య లక్ష్య మైవుండును.
3. పథకము క్రింద పనులను గ్రామీణ ప్రాంతములలో చేపట్టవలెను.
4. రాజ్య పరిషత్తు శాశ్వతమైన ఆస్తులను సృష్టించుటకైన సామర్థ్యము ఆధారంగా వివిధ ప్రాంతములకు ప్రాధాన్య పనుల జాబితాను తయారుచేయవలెను.
5. పథకము, పథకము క్రింద సృష్టించబడిన పబ్లిక్ ఆస్తుల సముచిత నిర్వహణ కొరకు రాజ్య ప్రభుత్వముచే రూపొందించబడునట్టి యుక్తమైన ఏర్పాట్లకు లోబడి ఉండును.
6. ఎట్టి పరిస్థితిలోను కార్మికులకు వేతన రేటు కంటే తక్కువ చెల్లించరాదు.
7. వేతనాలు పనిపరిమాణంతో స్వయంగ ముడిపడి ఉన్నయెడల, రాజ్య పరిషత్తుచే సంప్రదించి ప్రతి సంవత్సరం వివిధ రకముల పనుల కొరకు రాజ్య ప్రభుత్వము ద్వారా నిర్ణయించబడిన రేట్ల అనుసూచిననుసరించి వేతనములు చెల్లించవలెను.

8. నైపుణ్యరహిత కార్మికుల కొరకు వేతనరేట్ల అనుసూచిని, ఒక వ్యక్తి సాధారణముగా ఏడు గంటలు పనిచేసి వేతనరేటుకు సమానమైన వేతనమును సంపాదించునట్లు నియతము చేయవలెను.

9. నైపుణ్యం కలిగిన మరియు పాక్షిక నైపుణ్యం కలిగిన కార్మికుల వేతనములతోసహా పథకము క్రింద చేపట్టిన ప్రాజెక్టుల సామగ్రి కొరకయ్యే ఖర్చు మొత్తం ప్రాజెక్టు ఖర్చులో నలుబది శాతమునకు మించరాదు.

10. పథకం క్రింద ఉద్యోగం కొరకు దరఖాస్తు చేసుకొనిన ఎవరేని వ్యక్తిని, దానిక్రింద అనుమతించదగిన ఏ రకపు పనినైనను చేయమని ఆదేశించుటకు కార్యక్రమ అధికారికి మరియు గ్రామ పంచాయితీకి స్వేచ్ఛ ఉండును.

11. పథకము క్రింది ప్రాజెక్టుల అమలుకొరకు ఎవరేని కాంట్రాక్టరును నియమించు కోవడానికి అనుమతించరాదు.

12. పథకము క్రింద నిధులు అందజేయబడిన పనిని, సాధ్యమైనంత మేరకు యంత్రముల ద్వారా కాకుండ శారీరక శ్రమను వినియోగించుకొనుట ద్వారా నిర్వహించవలెను.

13. ప్రతి పథకములో అమలుకు సంబంధించిన అన్ని స్థాయిలలో పారదర్శకత మరియు జవాబుదారీతనం ఉండునట్లు జాగ్రత్త వహించుట కొరకు తగు నిబంధనలు ఉండ వలెను.

14. పని ప్రమాణమునుచూచుటతో పాటు, పూర్తిఅయిన పనికి చెల్లించిన వేతనాలు మొత్తం జరిగినపని ప్రమాణమునకు మరియు పరిమాణమునకు అనుగుణంగా యుండునట్లు జాగ్రత్త వహించుట కొరకు పథకం క్రింద చేపట్టిన పనుల నియతకాలిక తనిఖీ మరియు పర్యవేక్షణ కొరకు నిబంధనలు చేయవలెను.

15. పథకమును అమలుచేయుచున్న జిల్లా కార్యక్రమ సమన్వయకర్త, కార్యక్రమ అధికారి మరియు గ్రామ పంచాయితీ, తమ లేక తన అధికారితా పరిధిలో పథకము అమలుకు సంబంధించిన వాస్తవాలు, అంకెలు మరియు సాధించిన కార్యాలు పొందుపరచిన వార్షిక నివేదికను తయారుచేయవలెను మరియు దాని ప్రతిని పబ్లిక్ అభ్యర్థనపై పథకములో నిర్దిష్టపరచబడునట్టి ఫీజు చెల్లింపుపై అందజేయుటకై అందుబాటులో ఉంచవలెను.

16. పథకమునకు సంబంధించిన అన్ని లెక్కలు మరియు రికార్డులను ప్రజల పరిశీలన కొరకు అందుబాటులో ఉంచవలెను మరియు దాని యొక్క ప్రతి లేదా సంబంధిత ఉదాహృతులను పొందగోరు ఎవరేని వ్యక్తికి, అభ్యర్థనపై పథకములో నిర్దిష్టపరచబడునట్టి ఫీజును చెల్లించిన తరువాత అట్టి ప్రతులను లేదా ఉదాహృతులను అందజేయవచ్చును.

17. పథకం క్రింద ప్రతి పథకము లేక ప్రాజెక్టు యొక్క హాజరుపట్టీల ప్రతిని, పథకములో నిర్దిష్టపరచబడునట్టి ఫీజును చెల్లించిన తరువాత ఆసక్తి కలిగిన ఎవరేని వ్యక్తిచే తనిఖీ కొరకు గ్రామపంచాయితీ మరియు కార్యక్రమ అధికారి యొక్క కార్యాలయములలో అందుబాటులో ఉంచవలెను.

## అనుసూచి - 2

(5వ పరిచ్ఛేదము చూడుడు)

## పథకము క్రింద గ్రామీణ ఉద్యోగ హామీ కొరకైన షరతులు మరియు కార్మికుల కనీస హక్కులు.

1. (i) ఏవేని గ్రామీణ ప్రాంతములలో నివసించు; మరియు
   (ii) నైపుణ్యరహిత శారీరకశ్రమ చేయగోరు,

   ప్రతి యొక కుటుంబమునకు చెందిన వయోజన సభ్యులు, పనికార్డు జారీ చేయుటకొరకై వారి కుటుంబమును రిజిస్టరు చేయుట కొరకు వారు నివసించుచున్నట్టి అధికారితా పరిధిలోని గ్రామస్థాయిలో (ఇందు ఇటు పిమ్మట ఈ అనుసూచిలో గ్రామపంచాయితీగా పేర్కొనబడు) గ్రామ పంచాయితీకి వారి పేర్లు, వయస్సు మరియు కుటుంబము యొక్క చిరునామాను సమర్పించవచ్చును.

2. తాము సబబని భావించునట్టి పరిశీలన జరిపిన తరువాత కుటుంబమును రిజిస్టరు చేయుట మరియు పథకములో రాజ్య ప్రభుత్వముచే నిర్దిష్టపరచినట్టి విధముగా కుటుంబము యొక్క వయోజన సభ్యుల వివరములతో వారి ఫోటోగ్రాఫులను అంటించిన పని కార్డును జారీచేయుట గ్రామ పంచాయితీ యొక్క కర్తవ్యమై ఉండును.

3. 2వ పేరాగ్రాఫు క్రిందచేసిన రిజిస్ట్రీకరణ పథకములో పొందుపరచినట్టి కాలావధి వరకు ఉంచవలెను, అయితే, ఎట్టి సందర్భములోను అది ఐదు సంవత్సరముల కంటే తక్కువగా ఉండరాదు మరియు దానిని ఆయా సమయములందు నవీకరించవచ్చును.

4. పని కార్డులో పేరు ఉన్నట్టి రిజిస్ట్రీకృత కుటుంబము యొక్క ప్రతి వయోజన సభ్యుడు పథకము క్రింద నైపుణ్యరహిత శారీరకశ్రమ చేయుటకొరకు దరఖాస్తు చేసుకొనుటకు హక్కు కలిగివుండును.

5. ఒక కుటుంబమునకు చెందిన రిజిస్ట్రీకృత వ్యక్తులందరు (ఏదేని) ఒక ఆర్థికసంవత్సరములో కుటుంబమునకు ఒకవంద దినముల గరిష్ఠ పరిమితికి లోబడి, ఈచట్టము యొక్క నిబంధనల క్రింద చేసిన పథకమునకనుసరించి ప్రతియొక దరఖాస్తు దారుడు అభ్యర్థించినట్టి దినముల పాటు ఉద్యోగం పొందుటకు హక్కు కలిగియుండును.

6. కార్యక్రమ అధికారి, 5వ పేరాగ్రాఫులో పేర్కొనిన ప్రతి దరఖాస్తుదారుడికి, దరఖాస్తు స్వీకరించిన పదిహేను దినముల లోపల లేక ముందస్తు దరఖాస్తు చేసుకున్న సందర్భములో అతడు పనిని కోరిన తేదీ నుండి, ఇందులో ఏది తరువాత జరుగునో అప్పటి నుండి పథకము యొక్క నిబంధనలననుసరించి నైపుణ్యరహిత శారీరక శ్రమచేయుటకు పనిని కల్పించవలెను:

అయితే, ఈ చట్టము క్రింద రిజిస్టరు చేసుకొని పని కొరకు అభ్యర్థించిన లబ్ధిదారులలో కనీసం మూడింటా ఒకవంతు మంది మహిళలు ఉండునట్లు వారికి ప్రాధాన్యత ఈయవలెను.

7. పనికి దరఖాస్తులు కనీసం పదునాలుగు దినముల నిరంతర పని కొరకు చేయబడవలెను.

8. కుటుంబము యొక్క సమిష్టి హక్కుకు లోబడి ఉద్యోగము కొరకు దరఖాస్తు చేసుకొనిన వ్యక్తికి సంబంధించి ఉద్యోగ దినముల సంఖ్యపై లేక అతడికి వాస్తవంగా కల్పించిన ఉద్యోగ దినముల సంఖ్యపై పరిమితి ఏదియు ఉండరాదు.

9. పనికొరకు దరఖాస్తులను, పథకములో నిర్దిష్టపరచిన విధముగా గ్రామ పంచాయితీకి గాని లేక కార్యక్రమ అధికారికిగాని లిఖితపూర్వకముగా సమర్పించవచ్చును.

10. సందర్భానుసారము గ్రామ పంచాయితీ కార్యక్రమ అధికారి మాన్యమైన దరఖాస్తులను స్వీకరించుటకు మరియు దరఖాస్తుదారుడికి తేదీతో కూడిన రసీదును జారీచేయుటకు బద్ధులై ఉందురు. దరఖాస్తులను బృందముగా కూడా సమర్పించవచ్చును.

11. పని కల్పించబడిన దరఖాస్తుదారులకు, పనికార్డులో వారుఇచ్చిన చిరునామాకు ఉత్తరమును పంపుట ద్వారా మరియు జిల్లా, మధ్యస్థ లేదా గ్రామ స్థాయిలో పంచాయితీల కార్యాలయము వద్ద బహిరంగ నోటీసును ప్రదర్శించుట ద్వారా పని కల్పించినట్లుగా తెలియ జేయవలెను.

12. సాధ్యమైనంతమేరకు దరఖాస్తుదారుడు దరఖాస్తు చేయునపుడు నివసించుచున్నట్టి గ్రామము యొక్క ఐదు కిలో మీటర్ల వ్యాసార్థము లోపల ఉద్యోగమును కల్పించవలెను.

13. పథకము క్రింద కొత్త పనిని,

(ఎ) అట్టి పనికొరకు కనీసం యాభై మంది కూలీలు అందుబాటులో ఉన్నచో; మరియు

(బి) నడుస్తున్న పనులలో కూలీలను చేర్చుకోవడం సాధ్యము కానప్పుడు మాత్రమే ప్రారంభించవలెను:

అయితే, ఈ షరతు రాజ్య ప్రభుత్వముచే నిర్ధారించబడునట్లుగా పర్వత ప్రాంతములలోని మరియు అడవుల పెంపకమునకు సంబంధించిన కొత్త పనులకు వర్తించరాదు.

14. అట్టి వ్యాసార్థమువెలుపల ఉద్యోగము కల్పించబడిన సందర్భములలో దానిని బ్లాకు లోపల కల్పించవలెను మరియు అదనపు ప్రయాణ మరియు జీవన వ్యయం భరించుటకు వేతన రేటులో పదిశాతం అదనపు వేతనాలుగా చెల్లించవలెను.

15. ఉద్యోగ కాలావధికి సాధారణంగా వారంలో ఆరు దినముల కంటే ఎక్కువ కాకుండా కనీసం పదునాలుగు దినములు నిరంతరముగా ఉండవలెను.

16. నిరుద్యోగ భృతి చెల్లించిన లేక చెల్లించుటకు బకాయిపడిన అన్ని సందర్భములలో, కార్యక్రమ అధికారి ఉద్యోగము కల్పించుట అతనికి ఎందుకు సాధ్యంకాలేదో లేక దరఖాస్తు-దారులకు ఉద్యోగము కల్పించుటకైన కారణమును జిల్లా కార్యక్రమ సమన్వయకర్తకు లిఖితపూర్వకముగా తెలియజేయవలెను.

17. జిల్లా కార్యక్రమ సమన్వయకర్త, రాజ్యపరిషత్తుకి తాను సమర్పించు వార్షిక నివేదికలో, నిరుద్యోగ భృతి చెల్లింపుతో ముడిపడి ఉన్న కేసుల్లో ఉద్యోగం కల్పించనందుకు గల కారణములను వివరించవలెను.

18. పథకములో ముందస్తు దరఖాస్తుల కొరకు అనగా ఏ తేదీ నుండి ఉద్యోగము కోరబడినదో ఆ తేదీకి ముందే దరఖాస్తులు చేసుకొనుటకు ఏర్పాటు చేయవలెను.

19. పథకములో ఒకే వ్యక్తిచే అనేక దరఖాస్తులు సమర్పించుకొనుట కొరకు ఏర్పాటు చేయవలెను, అయితే ఏ కాలావధుల కొరకు ఉద్యోగము కోరబడినదో ఆ తత్సమానమైన కాలావధులు వేరువేరుగా అతివ్యాప్తి అయి ఉండవలెను.

20. గ్రామ పంచాయితీ, తాను జారీచేసిన పనికార్డులు మరియు పాస్ బుక్కులు, కుటుంబపెద్ద పేరు, వయస్సు మరియు చిరునామా మరియు పంచాయితీలో రిజిస్టరు చేసుకొన్న కుటుంబములోని వయోజన సభ్యుల వివరములు ఉన్నట్టి రిజిస్టర్లను, ఓచర్లను మరియు ఇతర దస్తావేజులను పథకములో నిర్దిష్టపరచబడునట్టి ప్రరూపము మరియు అట్టిరీతిలో తయారుచేయవలెను మరియు నిర్వహించవలెను లేక తయారు చేయబడి నిర్వహించ బడునట్లు చూడవలెను.

21. గ్రామపంచాయితీ, తమవద్ద రిజిస్టరు చేసుకొనిన కుటుంబముల పేర్లు మరియు చిరునామాలు మరియు ఆ కుటుంబాలలోని వయోజన సభ్యుల జాబితా లేక జాబితాలను సంబంధిత కార్యక్రమ అధికారికి పంపవలెను మరియు అట్టి ఇతర సమాచారమును పథక-ములో నిర్దిష్టపరచబడునట్టి కాలావధులలో మరియు అట్టిప్రరూపములో అందజేయవలెను

22. పని కల్పించబడిన వ్యక్తుల జాబితాను గ్రామ పంచాయితీ యొక్క నోటీసు బోర్డుపై మరియు కార్యక్రమ అధికారి యొక్క కార్యాలయము వద్ద మరియు కార్యక్రమ అధికారి సబబని భావించునట్టి ఇతర స్థలములలో ప్రదర్శించవలెను. మరియు జాబితాను రాజ్య ప్రభుత్వముచే మరియు ఆసక్తి కలిగిన ఎవరేని ఇతర వ్యక్తిచే తనిఖీ కొరకు బహిరంగపరచ వలెను.

23. గ్రామ పంచాయితీలో ఎవరేని వ్యక్తి తప్పుడు సమాచారమును అందజేయుట ద్వారా రిజిస్టరుచేసికొనినాడని గ్రామపంచాయితీ సంతృప్తిచెందినచో, అది, రిజిస్టరునుండి అతడి పేరును కొట్టివేయమని మరియు పనికార్డు తిరిగి ఇవ్వమని దరఖాస్తుదారుడికి ఆదేశించ వలసినదిగా కార్యక్రమ అధికారిని ఆదేశించవచ్చును:

అయితే, ఇద్దరు స్వతంత్ర వ్యక్తుల సమక్షంలో దరఖాస్తుదారుడికి ఆకర్ణింపబడుటకు అవకాశము ఈయబడిననే తప్ప, ఈ పేరాగ్రాఫు క్రింద ఎట్టి చర్య కొరకు ఆదేశించరాదు.

24. పథకము క్రింద నియమించబడిన ఎవరేని వ్యక్తికి అతడు ఉద్యోగంలో కొనసాగుతున్న క్రమములో ఆయనకు ప్రమాదవశాత్తు ఏదేని వ్యక్తిగత హాని అయినచో, అతడు పథకము క్రింద అనుమతించదగినట్టి ఉచిత వైద్య చికిత్సను పొందుటకు హక్కు కలిగిఉండును.

25. గాయపడిన కార్మికుడిని ఆసుపత్రిలో చేర్పించుట అవసరమైన యెడల, రాజ్యప్రభుత్వము, వసతి, చికిత్స, మందులు మరియు గాయపడినకార్మికుడు పనిలో ఉండినచో చెల్లించవలసి వున్న వేతనరేటులో సగంకంటే తక్కువ కానట్టి వేతనరేటు చొప్పున దినసరి భత్యం చెల్లింపుతోసహా ఆసుపత్రిలో చేర్పించుట కొరకు ఏర్పాటు చేయవలెను.

26. పథకము క్రింద నియమించబడిన వ్యక్తి, ప్రమాదవశాత్తు మరియు ఉద్యోగంలో కొనసాగు-తున్న క్రమములో మరణించినచో లేక శాశ్వతఅంగవైకల్యమునకు గురిఅయినచో, అతడికి, అమలు ఏజెన్సీ ఇరువది ఐదువేల రేటు చొప్పున లేదా కేంద్ర ప్రభుత్వముచే అధిసూచించబడునట్టి మొత్తమును అనుగ్రహ (ఎక్స్ గ్రేషియా) చెల్లింపుగా చెల్లించవలెను మరియు సదరు మొత్తమును మృతుడి శాసనిక వారసులకు లేక సందర్భానుసారముగ అంగవైకల్యుడికి చెల్లించవలెను.

27. రక్షిత మంచినీరు, పిల్లలకు నీడ మరియు విశ్రాంతి కాలావధులు, స్వల్ప హాని మరియు నిర్వహించుచున్న పనికి సంబంధించిన ఇతర ఆరోగ్యమువకు సంభవించదగిన హానికి అత్యవసర చికిత్స కొరకు తగిన సామగ్రితో ప్రథమ చికిత్స సదుపాయములను పని ప్రదేశము వద్ద సమకూర్చవలెను.

28. ఏదేని స్థలంవద్ద పనిచేయుచున్న మహిళల వెంటవచ్చు ఆరు సంవత్సరములలోపు వయస్సు గల పిల్లల సంఖ్య ఐదు లేక అంతకెక్కువ ఉన్న సందర్భములో, అట్టి పిల్లల సంరక్షణ కొరకు వారిలో ఒక మహిళను నియమించుటకై ఏర్పాటు చేయవలెను.

29. 28వ పేరాగ్రాఫు క్రింద నియమించబడిన వ్యక్తికి వేతనరేటును చెల్లించవలెను.

30. పథకము క్రింద నిర్దిష్టపరచిన కాలావధి లోపల వేతనముల చెల్లింపు జరగని సందర్భములో, వేతనముల చెల్లింపు చట్టము, 1936 (1936లోని 4వ చట్టము) లోని నిబంధనల ప్రకారం శ్రామికులు నష్టపరిహార చెల్లింపును పొందుటకు హక్కు కలిగివుందురు.

31. పథకము క్రింద వేతనములను పూర్తిగా నగదు రూపంలోగాని లేక నగదు మరియు వస్తు రూపంలోగాని చెల్లించవచ్చును, అయితే కనీసం నాలుగింట ఒకవంతు వేతనములు నగదు రూపములో మాత్రమే చెల్లించవలెను.

32. రాజ్య ప్రభుత్వము, వేతనములలోని కొంత భాగమును ఉద్యోగ కాలావధిలో దినసరి పద్ధతిపై నగదు రూపంలో చెల్లించాలని నిర్దిష్టపరచవచ్చును.

33. పథకము క్రింద నియమించబడిన ఎవరేని వ్యక్తివెంట వచ్చిన బిడ్డకు ప్రమాదవశాత్తు ఏదైన వ్యక్తిగతమైన హాని అయినచో, అట్టి వ్యక్తి, పథకము క్రింద నిర్దిష్టపరచబడునట్లుగా ఆ

బిడ్డకు ఉచిత వైద్యచికిత్స మరియు మరణము లేక అంగవైకల్యము సంభవించిన సందర్భములో రాజ్య ప్రభుత్వముచే నిర్ధారించబడునట్టి అనుగ్రహ (ఎక్స్ గ్రేషియా) చెల్లింపుకు హక్కు కలిగివుండును.

34. పథకము క్రింద ప్రతియొక ఉద్యోగ విషయంలో స్త్రీ, పురుష ప్రాతిపదిక ఆధారముగా మాత్రమే ఎట్టి వివక్ష చూపరాదు మరియు సమాన ప్రతిఫల చట్టము, 1976 (1976లోని 25వ చట్టము) లోని నిబంధనలను పాటించవలెను.

వి.కె. భాసిన్,
కార్యదర్శి, భారత ప్రభుత్వము.

PRINTED BY THE COMMISSIONER OF PRINTING, STATIONERY AND STORES PURCHASE AT THE GOVERNMENT SECRETARIAT PRESS ©, MINT COMPOUND, HYDERABAD. ANDHRA PRADESH, 2012